# ఆ చిత్రం

ఆమె ఒంటరిగా నడిచి వెడుతోంది.

బాటలోని గులకరాళ్లు గుచ్చుకుంటున్న బాధకంటె, ఇంకా తీవ్రమైన బాధను ఆమె భరిస్తున్నట్టుంది. అంచేతనే. ఆలోచించి, పరికించి వెయ్యవలసిన అడుగుల్ని గబగబావేసి నడుస్తున్నదామె.

విచారరేఖలు దట్టంగా కనపడుతున్నా, ఆమె అందంమాత్రం ఏమీ చెడలేదు. మనిషి చాలా చిక్కినా, ఆమె నాజూకు పోలేదు.

తదేకదీక్షతో, దృష్టిని యెక్కడో పెట్టుకుని గబగబ నడుస్తూ, ఆమె ఆ వీధి చివరకు వచ్చింది. ఆ వీధిమలుపు తిరగబోతున్నది. ఆమెకు ఎదురుగా, పరాకుగా, వస్తున్న మరొక వ్యక్తితో ఆమె ఢీకొన్నది. ఆమె కొంచెం చిరాకుపడి, సిగ్గుపడి, ప్రక్కకు తొలిగింది. అతడు కొంచెం భయపడి, సిగ్గుపడి, 'చూడలేదు' అంటూ ప్రక్కకుతొలిగాడు. ఆమె జాలిగా అతనివంక చూసి, ముందుకు అడుగువేసింది. అతడూ ముందు కడుగు వేశాడు.

ఆమె సందు మళ్ళింది. వెడుతున్నది. వెనకనుంచి రొప్పుతూ; రోజుతూ మనిషి వస్తున్న జాడనుబట్టి, ఆమె వెనకకు తిరిగి చూసింది. మళ్ళీ అతడే ప్రత్యక్షం. దగ్గరకు వస్తున్నాడు: ధోరణిచూస్తే, తనకోసమే వస్తున్నట్టుంది. ఆమెకు అర్థం కాలేదు నిలబడిపోయింది.

అతడామెను సమీపించి, మర్యాదగా కొంచెం యెడంగా నిలబడి "అమ్మా, మీరు యెవరు?" అని అడిగాడు. అదేం ప్రశ్న! ఆ ప్రశ్నకు ఆమె ఏమని జవాబు చెపుతుంది. మరుక్షణంలోనే, తనతెలివి తక్కువ అతనికే అర్థమయింది. "అమ్మా, నన్ను క్షమించండి" అన్నాడు ఏదో నేరం చేసినవాడిలాగ బాధపడుతూ. అతని వాలకం ఆమెకు అర్థమయింది. అతడు తనను యేదో అడుగదలచి, అవస్థపడుతున్నాడని ఆమె గ్రహించింది.

ఆలోచించకుండా, అప్రయత్నంగా "మీకేంకావాలి" అని అడిగివేసింది. అతడికేం కావాలి?

"ఏమీలేదమ్మా. నేను బొమ్మలు వ్రాస్తాను" అన్నాడు అతడు.

ఆమెకిది మరీ చిత్రమనిపించింది. ఏమీ మాట్లాడలేదు.

"ప్రస్తుతం ఒక పెద్దచిత్రం వ్రాయా

లనుకుంటున్నావు" అన్నాడు మళ్ళీ. ఆమె మాట్లాడనేలేదు.

"చనిపోయిన శిశువును, బుద్ధభగవానుని కాళ్ళమీద పడవేసి, గర్భశోకం పోగొట్టమని దీనంగా చూస్తూ అర్థించే స్త్రీ చిత్రం వెయ్యాలని" అన్నాడు అతడు. ఆమె గుండెలు కరిగిపోతున్నట్లున్నాయి. రొమ్ముమీద చెయ్యి వేసుకుంది.

"ఆ స్త్రీ ముఖం జాలిగొల్పేలా వుండాలి. ఆ స్త్రీ కళ్లు శోకానికి అద్దాలుగా వుండాలి" అంటున్నాడతను.

ఆమె చెప్పలేని బాధతో నిలువునా కంపించిపోతున్నది.

"అలాంటి స్త్రీ, ఎదట కూర్చుంటే, ఆమెను చూస్తూ కుంచెతో ఆమె మూడు మూర్తులనూ పటంమీద వ్రాయగలను. ఎన్నాళ్ళనుంచో వెతుకుతున్నాను, అలాటి జాలిగొల్పే ముఖంగల దేవతామూర్తి నాకు కనపడుతుందేమోనని. తల్లీ, మీ రెవరో నాకు తెలియదుకాని_" ఆ పైమాట అనలేకపోయాడతడు, ఆమె ముఖంచూస్తూ.

సంగతంతా, ఆమెకు అవగతమైపోయింది.

"మీ యిల్లెక్కడ?" అని ఆమె అడిగింది. ఆ ప్రశ్నలోని భావం అతని తలలో తళుక్కుని మెరిసింది. అతనిల్లు ఫలానాచోట అని తెలుసుకున్న తరువాత, "రేపు ఉదయం జాము ప్రొద్దుఎక్కి వస్తాను" అని చెప్పి ఆమె తనదారిన వెళ్ళిపోయింది. అతడూ తన దారిన వెళ్ళాడు.

మరునాటి ఉదయం జాము ప్రొద్దువేళల్లా ఆమె, అతని ఇంటికి వచ్చింది. ఆమె వచ్చేటప్పటికే అతడు, రంగులు కలుపుకొని, తెల్లని పటాన్ని, కుంచెను సిద్ధంగా పెట్టుకొని వున్నాడు.

బుద్ధదేవుణ్ని పుత్ర ప్రాణభిక్షకోసం అర్థించే స్త్రీని తాను యెలా చిత్రించదలచుకున్నదీ, ఆ చిత్రం ఎంత గొప్ప చిత్రం కాబోయేదీ, దానివల్ల తనకెంత కీర్తి దక్కబోతున్నదీ ఆమెకు చెప్పాడు. ఈ సందర్భంలో ఆమె తనకు చేయవలసిన సహాయాన్ని, ఆ సహాయపు విలువనూకూడా వివరించాడు.

తన శోకాన్ని, తన కడుపుమంటను, ప్రబలమైన తన కాంక్షనూ కళ్ళల్లో ప్రతిబింబిస్తూ, దయాసముద్రుడైన బుద్ధదేవునికేకాక, నిర్దాక్షిణ్యమూర్తి అయిన మృత్యుదేవతకుకూడా జాలిగొల్పే చూపుతో ఆ స్త్రీ, బుద్ధదేవునివైపు చూస్తుంటుంది.

"అలాటి చూపులతో మీరు, మీ యెదుటనే-నేనే బుద్ధదేవుణ్ణనుకోండి - బుద్ధభగవానుడున్నాడనుకొని, కొంచెంగా నడుంవంచి, స్వల్పమాత్రంగా మెడఎత్తి నిలబడాలి" అని చెప్పాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు.

అతడు చెప్పిన భంగిమంలో నిలబడడానికి ప్రయత్నం చేసింది. ఆమె సామ

ర్యానికి అతడు ఆశ్చర్యపడ్డాడు. ఆమె చూపుకి అతడు గజగజ వణికాడు. ఆ దేవతామూర్తిని స్వరూపంగా పెట్టుకొని ఎంత గొప్ప బొమ్మ వ్రాయవచ్చు!

చాలా సేపయింది. ఆమె విసుగుదల చూపలేదు. బడలికను కనపర్చలేదు. ఓపికను తగ్గనివ్వలేదు. అతడే పని నిలిపివేశాడు.

"మళ్ళీ, రేపు రాగలరా ?"
"ఎన్నిరోజులు రావాలి ?"
"పదిరోజులైనా పడుతుంది."
"సరే" నన్నది.

ప్రతిరోజూ, ఆమె అదేవేళకు వస్తున్నది. ఆ చిత్రనిర్మాణానికి, అతనికన్న ఎక్కువ కష్టపడుతున్నది. అతనికంటె ఎక్కువ శ్రద్ధ చూపుతున్నది.

చిత్రం పూర్తి కావచ్చింది. ఆమె, అతడూకూడా, పూర్తి కాబోతున్న ఆ చిత్రాన్ని చూసి మురిసిపోతున్నారు; పొంగిపోతున్నారు.

అవతారమూర్తి బుద్ధభగవానుని ప్రక్కనే, తాను ఒకే సమానాంతరంలో నిలిచివుండటమా ! ఎంత అదృష్టం. పటంలోనైతేనేమి, పుత్రప్రాణ భిక్ష కోసం బుద్ధదేవుణ్ణి తాను స్వయంగా ప్రార్థించడమా ! ఓ. ఎంతటి గొప్ప భాగ్యం. తన రూపం శాశ్వతంగా లోకంలో వుండిపోతోందా ! బుద్ధదేవుని చిత్రాన్ని చూస్తున్న ప్రతివారూ, తన పైన జాలి చూపమని తాను భగవాముణ్ణి ప్రార్థిస్తున్న, తన ఆ భంగిమాన్ని శాశ్వతంగా తమదృష్టిలో నిలుపుకొంటారు. ఆ చిత్రకారుడు వేసిన ఆ బుద్ధభగవానుని కన్నులలోనుంచి, అంత విపరీతంగా కారుణ్యతేజం ప్రజ్వరిల్లుతున్నదే ! ఆ కారుణ్యమంతా తనకోసమేనా ! ప్రపంచమంతటికొరకూనా ! బుద్ధదేవా ! "నీ సాన్నిధ్యాన నిలబడగలనా ! బ్రహ్మాండమయిన నీ కరుణను గ్రహించగలనా!" అలా ఆమె ఎంత ఆలోచించిందో ! ఎంత తన్మయత్వాన్ని పొందిందో ! బుద్ధదేవుణ్ణి, ఆ ప్రక్కనే, తనకే ఆశ్చర్యం గొలుపుతూన్న తన రూపాన్నీ చూసి చూసి, విడువలేక విడువలేక రోజూ ఆమె వెళ్ళిపోయేది.

అతడీ లోకంలోనే లేడు. ఈ చిత్ర రచనతో తాను అమరత్వంపొందుతాడు. బుద్ధదేవుడు తన కుంచెలో సాక్షాత్కరించి, ఆ పటంమీద రూపొందాడు. ఆ చిత్రాన్ని తాను, బుద్ధదేవుని ఆలయంలోనే నెలకొల్పుతాడు. వేలు. లక్షలు, కోట్ల ప్రజలు, తను వేసిన చిత్రంలోని బుద్ధదేవునికి మ్రొక్కుతారు. తన రచనా నైపుణికి శ్లాఘిస్తారు. తాను శారీరకంగా ఈ లోకంలో నిలువకపోయినా, తన పేరు, తన శక్తి, తన ప్రతిభ శాశ్వతంగా నిలిచిపోతుంది.

చీనా, సింహళ, జపానుదేశాలనుంచి,

ఎందరో యాత్రికులు వచ్చి ఈ చిత్రాన్ని చూస్తారు. వారందరూ తనకు జేజేలు పట్టవలసిందే! ఇది అతని కాంక్ష.

ఇక రెండురోజులపనిమాత్రం మిగిలి వుంది. ఆమెవచ్చి, అప్పుడే వెళ్ళిపోయింది. ముగియవస్తున్నదనే సంతృప్తితో, ఆనాటి శ్రమను మరిచిపోయి, అత డా చిత్రంవంక చూస్తూ కూచున్నాడు. వీధితలుపు చప్పుడయింది.

అతడు వెళ్ళి తలుపు తీశాడు.

"ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు" అంటూ, తలుపుతట్టిన వ్యక్తికి స్వాగతం చెప్పాడతడు.

"ఈ హృదయమే వచ్చాను. చాలా రోజులయిందికదూ, మనం కలుసుకొని" అంటూ, ఆవచ్చినవ్యక్తి అతణ్ణిఆలింగనం చేసుకున్నాడు. మిత్రులిద్దరూ కొంచెం సేపు చిరవిరహజాలైన ఆందబాష్పాలతో అలాగే మ్రాన్పడి నిలుచున్నారు.

మిత్రుడు లోపలికి వచ్చాడు. చిత్రకారుడు తాను ఈ మధ్య వ్రాసిన చిత్రాలన్నిటినీ మిత్రుడికి చూపించాడు. మిత్రుడి ఆనందానికీ, మెచ్చుకోళ్ళకూ పరిమితి లేదు.

చివరకు ఈ చిత్రం దగ్గరకు వచ్చారు. ఆ చిత్రభావాన్ని మిత్రుడికి చెప్పాడు చిత్రకారుడు.

మిత్రుడు, నోట మాటలేక, చాలా సేపు అలాగే, ఆ చిత్రంవంక చూస్తూ నిలబడిపోయాడు.

"ఎలావుంది?" అని అడిగాడు చిత్రకారుడు.

మిత్రుడు మాట్లాడలేదు.

"బాగాలేదా?" అని, బెదురుతూ అడిగాడు.

"ఈ స్త్రీముఖం — ఈ మెను చూశావా నువ్వు! లేక ఊహామాత్రమేనా!" అన్నాడు మిత్రుడు.

"ఊహించగలనా! ఇంత గొప్ప రూపును, ఇలాటి ముఖాన్ని ఉహించడం సాధ్యమేనా! ఆమె రోజూ యిక్కడకు వస్తుంది. ఆమెను చూస్తూ, చిత్రాన్ని పూర్తి చేస్తున్నాను."

మిత్రుడు ఫకాలున నవ్వాడు. "నువ్వు కూడా దాని వలలో పడలేదుకదా!" అనేశాడు,

చిత్రకారుడికి అది గొడ్డలిపెట్టు. "ఏం—" అంటూ నిశ్వసించాడు.

"ఏం లేదు. ఆ మనిషిని ఒకప్పుడు నేను యెరుగుదును. అప్సరస. ఎంత మంది పురుషులను తన వ్రేలిచుట్టూ తిప్పింది. ఎంతమందిని పాతాళలోకం లోకి తొక్కేసింది! ఎంతమంది భ్రష్టులైపోయారు. అలాటి అందం ఆమెది. ఇప్పుడేం చేస్తోందో!" చిత్రకారుడికి తల తిరిగిపోతోంది.

"ఆమె ఎవరేమిటి?" అని అతికష్టం మీద అడగ గలిగాడు.

"ఒక విలాసవతి. ఒక శృంగార స్వరూపిణి. ఒక యధేచ్ఛా విహారిణి" అని మళ్ళీ పకపక నవ్వాడు మిత్రుడు.

చిత్రకారుడు ఈ లోకంలో లేడు. మిత్రుడు యేవేవో కబుర్లు చెప్పి మళ్ళీ కనపడతానని చెప్పి వెళ్ళిపోయాడు.

చిత్రకారుడికి ఆనాడు తిండి రుచించ లేదు. తల పగిలి పోతున్నది. బుద్ధదేవుని రూపం పక్కన, ఒక వ్యభిచారిణినా తాను చిత్రిస్తూవుంట. దారుణం. భగవానుడి ప్రక్కన నిలుచుండడానికి ఆ స్త్రీకి అర్హత—ఓ ఎంతటి పాపకర్మ.

మరునాడు యధావిధిగా ఆమెవచ్చింది. ఆమెవంక చూడలేకపోయాడతడు. అతదేదో బాధపడుతున్నట్టు ఆమె గ్రహించింది.

"మీకు ఆరోగ్యంగా లేదా, ఇవ్వాళ?" అన్నది.

అతడు ఆమెవంక చూడకుండానే "మీ పేరు సునందా?" అని అడిగాడు.

ఆమె నివ్వెరపోయింది. ఆమె ముఖంలోని జీవకళ అదృశ్యమయింది. చాలా సేపటికి కాని, "అవును" అని ఆమె అనలేకపోయింది.

"మీ సంగతి ముందుగానే నాకు చెప్పి వుండవలసింది. నా చిత్రంలో వుండవలసిన స్త్రీ, నిజజీవితంలోకూడా, బుద్ధభగవానుడి సన్నిధిలో వుండడానికి అర్హురాలుగా వుండాలి" అని, తలయెత్తకుండానే అన్నాడతడు.

"భగవానుడు పతితులను ఉద్ధరించలేడా?" అన్నదామె. పాలిపోయిన ఆమె పెదవులు, వికృతమైన చిరునగవుతో రక్తిమను పొందాయి.

"భగవానునిముందు, పతితులను నిలబెట్టే స్వాతంత్ర్యం నాకు లేదు" అన్నాడతడు. వీధి తలుపు చప్పుడయింది. అతడు తలయెత్తి చూశాడు. ఆమె వెళ్ళిపోయింది. పూర్తిచెయ్యకుండానే, అతడా బొమ్మను మూలపెట్టివేశాడు. ఆరు నెలలు గడిచిపోయాయి. అతడు మళ్ళీ మరొక చిత్రాన్ని వ్రాయడానికి ప్రయత్నించలేదు. పాతచిత్రాలను బైటికి తియ్యలేదు.

మళ్ళీ ఆనాటి మిత్రుడు ప్రత్యక్షమయాడు.

"ఏదీ ఆబొమ్మ, పూర్తి అయిందా?" అని అడిగాడు.

"లేదు. అది ఇక పూర్తికాదు. బుద్ధభగవానుని యెదుట, ఆ స్త్రీని ఎలా నిల

బెట్టగలను!' అని రెండు చేతులతోనూ కణతలు పట్టుకున్నాడు చిత్రకారుడు

"ఆమె ఏమయిందో తెలుసా నీకు-" అని అడిగాడు మిత్రుడు

"నా కనవసరం" అన్నాడు చిత్రకారుడు

"ఓరి దౌర్భాగ్యుడా ఆమె నిన్న చనిపోయింది-" అని నిట్టూర్చాడు మిత్రుడు

"ఆమె మరణంవల్ల నా భాగ్యానికి లోటేమిటి!' అని ఎదిరించాడు చిత్రకారుడు

'నీ దౌర్భాగ్యమే రెండు సంవత్సరాలుగా ఆమె ఎలా బ్రతికిందో తెలుసునా! పూర్వం ఆమె విలాసంకోసం వ్యభిచరించింది సుఖపడింది బాధలూ పడింది చివరకు ఒక ప్రియుడు ఆమెను మోసగించాడు ఆమె ఆ తరువాత ఎన్నో వూళ్లు తిరిగింది ఈ వూరు చేరింది ఒక గ్రుడ్డివాని గడిసెలో కాపురముంది రోగంతో అందత్వంతో ముసలితనంతో చస్తున్న వానికి పరిచర్య చేసింది వాణ్ని పోషించడానికి ఆమె దినమంతా చాకిరీ చేసింది వాడు దృష్టి రాకపోయినా యౌవనం తెచ్చుకోలేకపోయినా మళ్ళీ ఆరోగ్యాన్ని పొందాడు వాడికోసం చాకిరీచేసి ఆ సుకుమారి రోగాన్ని తెచ్చుకొని సంతోషంతో నిన్ననే చనిపోయింది ఆమె చనిపోయిన ఒక ఘడియతరువాత ఆమె ఉనికి నేను కనుక్కోగలిగాను ఆమె నివసించిన ప్రాంతంలో వున్నవాళ్ళలో "ఆమె దేవత" అని అననివారులేరు దౌర్భాగ్యుడా ఇప్పటికైనా ఆ చిత్రం పూర్తి చెయ్యి ఒకప్పుడామె పాపమార్గంలో నడిచి వుండవచ్చు కాని పాపసంహారం చేసుకొని మరీ ఆమె భగవానుని దగ్గరికి వెళ్ళింది" అన్నాడు మిత్రుడు

చిత్రకారుడు లేచి నిలుచున్నాడు

భగవానుని యెదుట నిలబడే అర్హత ఆమెకు లేదనుకున్నాను కాని నిజం ఏమిటంటే-భగవానుని చిత్రాన్ని వ్రాసే అర్హతకూడా నాకులేదు ఆ చిత్రం ఇక యెన్నటికీ పూర్తి కాదు- అన్నాడతడు